మార్గం.. మరింత విశాలం



మహారాణి పార్లర్ వద్ద కూడలిలో నిర్మిస్తున్న ఫౌంటైన్



గురుద్వారా కూడలిలో వెడల్పు చేస్తున్న రహదారి

- ప్రధాన కూడళ్ల అభివృద్ధికి చర్యలు
- జంక్షన్లలో వాటర్ ఫౌంటైన్ల నిర్మాణం
- చురుగ్గా రహదారుల విస్తరణ

సీతంపేట: నగరాభివృద్ధిలో భాగంగా అన్ని ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేసి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఆధునికీకరిస్తున్నారు. ఉత్తర నియోజకవర్గంలోని సత్యం కూడలి, మహారాణి పార్లర్ కూడలి, రైల్వే న్యూకాలనీ జంక్షన్లను మరింత సుందరంగా అభివృద్ధి చేస్తున్నారు.

మాధవధార మారియట్ హోటల్ నుంచి సీతమ్మధార అల్లూరి విగ్రహం వరకు 80 అడుగుల రోడ్డు విస్తరణ, దొండపర్తి కూడలి నుంచి అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ వరకు 60 అడుగుల రోడ్డుగా.. అక్కడి నుంచి జాతీయ రహదారి వరకు 80 ఫీట్ రోడ్డుగా విస్తరణ చేపట్టనున్నారు. వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా, ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రధాన రహదారుల విస్తరణ, కూడళ్ల అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

స్మార్ట్ సిటీ నిధులతో పనులు

స్మార్ట్ సిటీ నిధులు రూ.96 లక్షలతో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని మహారాణి పార్లర్ కూడలి అభివృద్ధి పనులు వారం రోజులుగా చురుగ్గా జరుగుతున్నాయి. జంక్షన్ మధ్యలో సుందరంగా ఉండేలా వాటర్ ఫౌంటైన్ నిర్మిస్తున్నారు. ఈ కూడలిలో నాలుగు వైపులా ఫుట్‌పాత్స్, టేబుల్ టాప్స్, సెంటర్ ఐలాండ్, కోబుల్ స్టోన్ ఫ్లోరింగ్‌తో ఆధునికంగా.. ఆకర్షణీయంగా తయారు చేయనున్నారు.

అభివృద్ధి పనులపై హర్షం

గురుద్వారా కూడలిలో జాతీయ రహదారి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వాహనాలు మలుపు తిరిగే చోట రోడ్డును విస్తరిస్తున్నారు. దీనివల్ల మద్దిలపాలెం వైపు నుంచి వచ్చే బస్సులు, ఇతర వాహనాలు సాఫీగా మలుపు తిరిగి ఆర్టీసీ కాంప్లెక్స వైపు వెళ్లడానికి మార్గం మరింత సుగమం అవుతుంది. ఈ అభివృద్ధి పనులపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మతిమరుపు సమస్య క్లిష్టమైనది



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.ఎస్.రాజు

సీతంపేట: ఆరు పదులు దాటిన వృద్ధుల్లో ఎనిమిది శాతం మందికి కలిగే మతిమరుపు వ్యాధి అత్యంత క్లిష్టమైనదని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.రాజు అన్నారు. ప్రపంచ అల్జీమర్స్ డే సందర్భంగా కౌసల్య కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషుల్లో కంటే మహిళల్లో ఎక్కువగా మతిమరుపు వస్తుందని చెప్పారు. ప్రారంభంలో చిన్నచిన్న విషయాలను మరిచిపోవడం, ఆ తర్వాత సమస్య తీవ్రమై తమ దైనందిన చర్యల నిర్వహణ కూడా కష్టమవుతుందన్నారు. ప్రవర్తనలో మార్పులు, అనిశ్చిత భావోద్వేగాలు, భ్రమలతో భయకంపితులు కావడం, దారులు మర్చిపోవడం, దుస్తులు వేసుకోవడం కష్టం కావడం, కుటుంబ సభ్యులను గుర్తు పట్టలేకపోవడం వ్యాధి తీవ్రతను సూచిస్తుందని తెలిపారు. జ్ఞాపకశక్తి మెదడులో ఏవిధంగా నిక్షిప్తమవుతుంది, అది క్షీణించి మతిమరుపు కలగడానికి గల కారణాలను వివరించారు. ఈ వ్యాధిని సరైన సమయంలో గుర్తించి నిపుణుల సలహాలతో కొంత నివారించవచ్చన్నారు. చక్కని నిద్ర, పోషకాహారం, ప్రణాళిక బద్ధమైన దినచర్య, తేలికపాటి వ్యాయామం ఈ వ్యాధిని అరికట్టడంలో కీలకంగా ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో మానసిక వైద్యులు ఎస్.జి.నిహాల్ పాల్గొన్నారు.

శాంతితోనే అభివృద్ధి సాధ్యం

సీతంపేట: దేశాల మధ్య శాంతి నెలకొల్పడం ద్వారానే అభివృద్ధి సాధ్యమని గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య బాలమోహన్‌దాస్ అన్నారు. అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి కోసం దేశాలన్నీ కలిసి కృషి చేయాలని, భారతదేశం చురుకైన పాత్ర వహించాల్సిన అవసరం ఉందన్నారు. దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు నిత్యం జరుగుతూనే ఉండాలని సూచించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ శాంతిని నెలకొల్పడం కోసం ఐక్య రాజ్య సమితి చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో బేగ్, ప్రజ్ఞాన్ కుమార్, నాయుడు, కమల్, గోపీచంద్ పాల్గొన్నారు.

ఆధునిక తెలుగు సాహిత్య యుగకర్త గురజాడ



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విభాగ ఆచార్యులు, విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆధునిక తెలుగు సాహిత్య యుగకర్తగా గురజాడ అప్పారావు పేరొందారని ఏవీఎన్ కళాశాల విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ ఎస్.పోలయ్య అన్నారు. గురువారం ఏయూ తెలుగు విభాగంలో గురజాడ వెంకట అప్పారావు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పోలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురజాడ సమాజాన్ని తన రచనల ద్వారా మేల్కొల్పారన్నారు. గురజాడ రచనలు భాషలో, భావంలో, చందస్సులో నూతనత్వాన్ని ప్రతిపాదించారన్నారు. కన్యాశుల్కం నాటకం తెలుగు సాహిత్య చరిత్రలో అజరామమై నిలిచిన విధానాన్ని వివరించారు. ఈ నాటకం అనేక విమర్శలకు దీటుగా నిలబడటానికి కారణాలను విశ్లేషించారు. ఆత్మీయ అతిథులు ఆచార్య జి.యోహాన్‌బాబు, ఆచార్య వెలమల సిమ్మన్న, తెలుగు ఆచార్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్



ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో ఖోఖో ఆడుతున్న బాలికలు



యోగా పోటీల్లో ఆసనాలు వేస్తున్న విద్యార్థినులు

సీతంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ గ్రౌండ్‌లో గురువారం ఉత్తర నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అండర్- 14, అండర్-17 బాలికలకు పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో గెలుపొందిన 100 మంది విద్యార్థినులు పాల్గొని ప్రతిభ చూపారు. నియోజకవర్గంలోని పాలాక్స్, హరగోపాల్, ఎన్జీజీవోస్ జీవీఎంసీ హైస్కూల్, మాధవధార, కె.కాలనీ, కప్పరాడ జీవీఎంసీ హైస్కూళ్లు, శారదా స్కూల్, ఎస్.ఎస్.వి. ఎన్.స్కూల్ విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, యోగా, షాట్‌పుట్, డిస్క్‌త్రో, 100, 200, 400 మీటర్ల పరుగు పోటీలు జరిగాయి. శుక్రవారం బాలురకు పోటీలు నిర్వహిస్తామని మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీజీవోస్ స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనరస, పీడీలు సునంద్, తబిత, పీఈటీలు త్రినాథ్, సురేష్, శారద, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి గురువారం నిర్వహించే సహస్ర తులసీదళార్చనలో రూ.1,500 చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో 32 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తులు రూ.1,000 చెల్లించి ఈ సేవలో పాల్గొనవచ్చు. పరోక్ష పద్ధతిలో పాల్గొనాలనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో పూజా రుసుం చెల్లించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు సత్యరూపవాణి, బి.అనురాధ, సుబ్రహ్మణ్యం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి పవిత్రోత్సవాలు

అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 24 నుంచి 27 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఈ నెల 26న ఉదయం 9 గంటల నుంచి 27వ తేదీ ఉదయం 11 గంటల వరకు అంతరాలయ దర్శనాలు, పంచామృతాభిషేక సేవలు నిలుపుదల చేయనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు. ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేయింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి



విజయ గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

విజయ గణపతికి వైవీ సుబ్బారెడ్డి పూజలు

సీతమ్మధార: వినాయకుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆకాంక్షించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయ ఆవరణలో నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన విజయ గణపతిని గురువారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించిన సందర్భంగా మండప ఆవరణలో 108 కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పరిపాలన రాజధానిగా విశాఖ అన్ని విధాల అనుకూలమని, పర్యాటక రంగంలో ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

కె.కె.రాజు మాట్లాడుతూ పరిపాలన రాజధాని విశాఖ పర్యాటక, విద్య, వైద్యం, పారిశ్రామిక, రవాణా ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. మూడు ప్రాంతాలతోపాటు అందరూ కలిసి ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందుకు వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, ఉత్తరాంధ్ర జేఏసీ కన్వీనర్ లజపతిరాయ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రొంగళి జగన్నాథం, దామా సుబ్బారావు, కాశీ విశ్వనాథం, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల సభ్యులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతిగా దుర్గాగణపతి



సీతంపేటలో పూజలందుకున్న లక్ష్మీగణపతి

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఆలయంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాలుగో రోజు గురువారం లక్ష్మీగణపతి అలంకరణలో దుర్గాగణపతి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హరిశ్చంద్ర నాటకం ప్రేక్షకులను అలరించింది. శుక్రవారం ఆది గణపతి అలంకారంలో స్వామి దర్శనమిస్తారని కార్పొరేటర్ గోవింద్, ఈవో రమాభాయి తెలిపారు.

ధర్మాచరణమే గణపతి పూజలో పరమార్థం

సీతంపేట: ధర్మాచరణమే గణపతి పూజలో పరమార్థమని శతావధాని తాతా సందీప్ శర్మ అన్నారు. శంకరమఠంలో గణేశ పురాణంపై రెండో రోజు గురువారం ఆయన ప్రసంగించారు. గణేశ పురాణాన్ని సోమకాంత మహారాజుకు భృగుమహర్షి ఉపదేశించారన్నారు. గొప్ప రాజైన సోమకాంతుడు తన కుమారుడికి ఎలా ఉండాలో అనేక ధర్మాలు ప్రబోధించిన విషయాలను వివరించారు. పూర్వజన్మ శాపం చేత రోగగ్రస్తుడైన సోమకాంతుడు భృగు మహర్షి ఉపదేశం చేతనే వ్యాధి పోగొట్టుకుని గణేశ ఆరాధన చేసి మోక్షం పొందారని తెలిపారు. విద్యుక్త ధర్మాచరణాన్ని ప్రోత్సహించి ప్రబోధించేదే గణపతి తత్వమని పేర్కొన్నారు. సత్యం, అహింస, దానం, క్షమ ధర్మాచరణంలోకే వస్తాయన్నారు.

గణపయ్యకు దీపారాధన



కోనేరులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులో వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పార్వతీనగర్‌లో సుప్రీంబాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండప వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నాలుగో రోజు గురువారం మండప ప్రాంగణంలో తాత్కాలిక కోనేరు ఏర్పాటు చేశారు. దానిలో అనేక మంది స్థానిక భక్తులు దీపాలు వదిలి వినాయకుడిని ఆరాధించారు.

సందడిగా నిమజ్జనోత్సవాలు



నిమజ్జన ఊరేగింపులో యువత సందడి

మద్దిలపాలెం: వినాయక నిమజ్జనోత్సవాలు ప్రారంభమయ్యాయి. పిఠాపురం కాలనీ కళాభారతి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ముందుగా భారీగా బాణసంచా కాల్చారు. అనంతరం వీధిలోని యువతీ, యువకులు, చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ఊరేగింపు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. డీజే మ్యూజిక్‌కు తగ్గట్టుగా స్టెప్‌లు వేసి సందడి చేశారు. దీంతో పిఠాపురం కాలనీ సాయంత్రం నుంచి రాత్రి వరకూ డీజేతో హోరెత్తిపోయింది. ఈ ఊరేగింపును తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అదనపు డీసీపీ శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో గురువారం ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ(ట్రాఫిక్) జి.శ్రీనివాసరావు విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చని చెప్పారు. దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని, వాహనాలు నడిపేటప్పుడు యువత ఎంతో జాగ్రత్త వహించాలని సూచించారు. పిల్లలకు ఏ చిన్న ప్రమాదం సంభవించినా వారి తల్లిదండ్రుల జీవితం అగమ్యగోచరం అవుతుందని గుర్తించాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకుని తమకు భరోసాగా ఉండాల్సిన పిల్లలు ప్రమాదాల్లో గాయాలపాలై తల్లిదండ్రులకు భారం కాకూడదన్నారు. ఏవీఎన్ కళాశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు ప్రపంచంలో అత్యున్నత స్థాయిలో ఉన్నారని, వారిని నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రయత్నాలు సాగిస్తూనే ఉండాలన్నారు. ఇంటర్, డిగ్రీ చదువుతున్న సమయంలోనే వృత్తి నైపుణ్య శిక్షణ, భాషా పరిజ్ఞానం పెంపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. హార్బర్ సర్కిల్ ట్రాఫిక్ సీఐ జి.ఆర్.కె.తులసీదాస్ మాట్లాడుతూ రోడ్లపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ఇంగ్లిష్ విభాగాధిపతి పైడి రజని, సురేష్‌బాబు, యేసయ్య, అప్పారావు, వినీత, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A.171/2023 IN O.S. 1447/2016

Between:
Sri Gudela Balaji ... Petitioner/Plaintiff
And
Thummala Venkata Ramana ... Respondent / Defendant

To **Respondent/Defendant**
Thummala Venkata Ramana, S/o. Venkatesh, R/o. D.No.49-24-26/A, Lalitha Nagar, Visakhapatnam.

The above named petitioner has filed the above interlocutory application against you under Order XXXIV Rule 5 of CPC for passing a final decree in terms of the preliminary decree dt : 06-06-2019 in the above mentioned suit. The above application stands posted to 20-11-2023 at 10.30 a.m. for your appearance before the Hon'ble Court. You are hereby informed to attend before the above court on the said date with relevant records either yourself in person or through an advocate duly instructed by you, failing which the matter will be decided accordingly as per the material available in your absence.

MKS ASSOCIATES
M.S.VENKATESH, M.K.SRINIVAS, M.KAUSHIK,
Advocates
Subhadra Commercial Complex, Bowdara Road, Visakhapatnam
Visakhapatnam
Date : 06-09-2023

పబ్లిక్ డిమాండ్

కాలువలపై పలకలు వేయండి



సత్యసాయినగర్‌లో పలకలు లేని కాలువ

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురం దరి సత్యసాయినగర్‌లో ఇటీవల కాలువలను పునర్నిర్మించారు. చాలా బాగున్నాయి. వాటిపై పలకలు వేయకపోవడం వల్ల ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి కాలువలన్నింటిపై శ్లాబులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– కె.రాజు, సత్యసాయినగర్

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధి 33/11 కేవీ నక్కవానిపాలెం, 33/11 కేవీ ఏఎస్సార్ నగర్, 33/11 కేవీ రాజేంద్రనగర్ సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్-1 ఈఈ బి.సిం హాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సీతమ్మధార, ఏఎస్సార్ నగర్, శాంతిపురం, సీతంపేట, పీ అండ్ టీ కాలనీ, బాలయ్యశాస్త్రి లేఅవుట్, టీపీటీ కాలనీ, గురుద్వారా, రాజేంద్రనగర్, తులసీపేట, బుల్లయ్య కళాశాల, స్పెన్సర్స్, ఏపీ స్టేట్ ఫైనాన్స్ ఆఫీస్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మర్రిపాలెం సెక్షన్ పరిధిలో..

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధి ఈపీఎఫ్, కరాసా, రైల్వే క్వార్టర్స్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మర్రిపాలెం వుడా లేఅవుట్, లీడర్ ప్రెస్ ఏరియా, శివశివాని పాఠశాల, పోలీస్ క్వార్టర్స్, ఈపీఎఫ్ క్వార్టర్స్, ఓల్డ్ కరాసా, న్యూ కరాసా, రైల్వే క్వార్టర్స్, మర్రిపాలెం ప్రధాన రహదారి, గవర వీధి, గొల్ల వీధి, రాణాప్రతాప్ నగర్, శ్రీనివాస నగర్, హుస్సేన్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

డీఎల్‌సీసీ చైర్‌పర్సన్‌గా డాక్టర్ ఉష



ఉషను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలు డాక్టర్ పి.ఉష డిస్ట్రిక్ట్ లెవెల్ లోకల్ కంప్లైంట్స్ కమిటీ(డీఎల్‌సీసీ) చైర్‌పర్సన్‌గా రెండో సారి నియమితులయ్యారు. ఈమె ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు. ఈమెతోపాటు ఇతర సభ్యులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మహిళలు పనిచేసే స్థలంలో లైంగిక వేధింపులు సంబంధిత ఫిర్యాదులపై ఈ కమిటీ విచారణ చేస్తుంది. ఈ సందర్భంగా డాక్టర్ ఉషను ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు.

అప్పన్న సన్నిధిలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న విజయబాబు దంపతులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

25న ఎస్పీ బాలు తృతీయ వర్ధంతి

మద్దిలపాలెం: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తృతీయ వర్ధంతి ఈ నెల 25న నిర్వహించనున్నామని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆరోజు సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అనంతరం తనికెళ్ల భరణి దర్శకత్వంలో ఎస్పీ బాలు నటించిన మిథునం చిత్రాన్ని ప్రదర్శించనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.